ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
శనివారం 9 ఆగస్టు 2025

వరాలివ్వు వరలక్ష్మీ మాత


శ్రీశైల క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



కర్నూలు కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో విచ్చేసే వరలక్ష్మీ వేడుకను శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొలిచే వారికి కొంగు బంగారంగా.. తమ కోరికలు తీర్చే ఇలవేల్పుగా మహాలక్ష్మీ అమ్మవారిని స్తుతిస్తూ విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేక కార్యక్రమాలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. మహిళలు తమ గృహాలకు సమీపంగా ఉన్న ఆలయాలకు వెళ్లి ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతం సందడి శుక్రవారం బాగా కానవచ్చింది. మహిళలు వేకువజామున్నే ఇళ్లను, పూజా గదులను శోభాయమానంగా పూలతో అలంకరించారు. పూజా మందిరాల్లో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు. అపార్ట్‌మెంట్లు, బహుళ గృహ సముదాయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొని ముత్తయిదువులకు వాయినాలు అందజేశారు. శ్రీశైల క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు.


గోదాగోకుల క్షేత్రంలో


లలితా పీఠంలో పాల్గొన్న భక్తులు


సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో..

15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

- ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించొచ్చు
- ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు


ఆదోని బస్టాండ్‌ను పరిశీలిస్తున్న పూల నాగరాజు

ఆదోని, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బసుస ప్రయాణ వసతి 'స్త్రీ శక్తి' పేరుతో ఈనెల 15వ తేదీ నుంచి అమలులోకి వస్తోందని, మహిళలు ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రమంతా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. ఆదోని బస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు సంతోషం వ్యక్తంచేశారు. బస్ స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలను నాగరాజు పరిశీలించి, రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, విద్యార్థినులు ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను చూపించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఆదోని ఆర్టీసీ బస్టాండుకు ఇరువైపులా ప్రహరీ కోసం ప్రతిపాదనలు పంపించాలని, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎంకు సూచించారు. డిపో గ్యారేజ్ సందర్శనలో సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్సుల ఫిట్‌నెస్‌పై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. బస్ స్టేషన పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణకు సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటచౌదరి, యువ నాయకులు మారుతినాయుడు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి, డిపో మేనేజర్ రఫిక్ పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చదనం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని మహోద్యమంగా చేపడుతున్నాయి. మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని ప్రభుత్వం పెద్దఎత్తున ప్రజల్లో అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. అందుకు విరుద్ధంగా కర్నూలు నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇటీవలే పెద్ద వృక్షాలను నరికి వేశారు. దాదాపు 30 సంవత్సరాల వయస్సు ఉన్న మహా వృక్షాలను తొలగించడంతో పలువురు పర్యావరణ వేత్తలు అవాక్కు అవుతున్నారు. గతంలో పని చేసిన ప్రిన్సిపాళ్లు ఎంతో కాలంగా శ్రమించి వాటిని సంరక్షిస్తూ మొక్కలు వృక్షాలుగా ఎదగడానికి కృషిచేశారు. వాటిని నరికివేయించడంతో కళాశాల ప్రాంగణం బోసిపోయింది.

● కర్నూలు ఎడ్యుకేషన్, ఆంధ్రజ్యోతి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తే ఊరుకోం

- ఈసీపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్, బీజేపీ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే ఊరుకోమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ఓటర్ లిస్టులో చేస్తున్న అవకతవకలపై సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ బిహార్‌లో జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ బాగోతం బయట పడిందన్నారు. ఒక్కసారిగా 65లక్షల ఓట్లు తీసివేయడం బీజేపీ కుయుక్తులకు అనుగుణంగా పనిచేయడమే అన్నారు. బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్న ఈసీపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు టి.రాముడు, ఎండి.ఆనంద్‌బాబు, జి.రామకష్ణ, ఎండీ అంజిబాబు, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత..

- గుంతకల్లుకు బస్సు సౌకర్యం
- మద్దికెర మండలంలోని నాలుగు గ్రామాలకు సర్వీసుల పునరుద్ధరణ


గుంతకల్లుకు వెళ్తున్న బస్సు

మద్దికెర/తుగ్గలి ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ నుంచి మద్దికెర మండలంలోని పెరవలి, హంప, ఎడవలి, ఎం.అగ్రహారం మీదుగా గుంతకల్లుకు 20ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్సు నడిచేది. అప్పట్లో ఆటోల ప్రభావంతో ఆ బస్సు సర్వీసులను రద్దు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తమకు బస్సు నడపాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో శుక్రవారం సర్వీసులు ప్రారంభమయ్యాయి. రోజుకు రానుపోనూ నాలుగు సర్వీసులు నడవనున్నాయి. ఉదయం పత్తికొండలో 8 గంటలకు బయలుదేరి 9.15 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుంది. 9.30 గంటలకు గుంతకల్లు నుంచి బయలుదేరి 10.45 గంటలకు పత్తికొండకు చేరుకుంటుంది. అలాగే మధ్యాహ్నం 3.15 గంటలకు పత్తికొండ నుంచి బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుంది. సాయంత్రం 4.45 గంటలకు గుంతకల్లు నుంచి బయలుదేరి 6 గంటలకు పత్తికొండకు చేరుకుంటుంది. వయా రాతన, తుగ్గలి, మద్దికెర మీదుగా ఈ బస్సు సర్వీసులు నడపనున్నారు. 20 ఏళ్ల తర్వాత బస్సు పునఃప్రారంభం కావడంతో ప్రయిణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్త్రీశక్తిలో భాగంగా ఆర్టీసీ వారు ఉచిత బస్సు నడపబోతుండడం ఆనందంగా ఉందని టీడీపీ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడు అన్నారు.

ఐఐఐటీడీఎం రిజిస్ట్రార్ బదిలీ


కే.గురుమూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జగన్నాథగట్టుపై ఉన్న కర్నూలు ఐఐఐటీ డీఎం రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న కె.గురుమూర్తి బదిలీ అయ్యారు. 1993 బ్యాచ్‌కు చెందిన యూపీఎస్‌పీ సివిల్ సర్వీసెస్ అధికారి ప్రభుత్వ పరిపాలనలో విస్తృత అనుభవం ఉన్న సివిల్ సర్వెంట్ ఐఐఐటీడీఎం నిర్వహణలో అనేక మార్పులు తీసుకువచ్చారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో డైరెక్టర్‌గానూ, ఈగవర్నెన్స్‌లో కీలక విప్లవాత్మక మార్పులు ఆయన తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ శాసన స్పీకర్‌కు గురుమూర్తి ఓఎస్‌డీగానూ, ఏపీ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖలో అదనపు కార్యదర్శిగా పని చేశారు. నెదర్లాండ్స్ బెల్జియం, జర్మనీ, మలేసియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో ప్రజా విధానాలు నాయకత్వంపై అంతర్జాతీయ శిక్షణ పొందారు. తిరిగి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలో చేరేందుకు రిజిస్ట్రార్ విధుల నుంచి శుక్రవారం రిలీవ్ అయ్యారు.

దళిత యువకుడిపై వైసీపీ క్రూరత్వం

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

7

అంగరంగ వైభవంగా.. సప్తరాత్రోత్సవాలు ప్రారంభం

- రాఘవేంద్రస్వామి మఠంలో ధ్వజారోహణతో మొదలైన వేడుకలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- ధాన్య పూజ చేసిన పీఠాధిపతి
- అలరించిన కూచిపూడి నృత్యం


ధ్వజారోహణతో ఉత్సవాలకు నాంది పలుకుతున్న దృశ్యం


ధాన్యపూజ చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి మహాముఖద్వారంపై ధ్వజారోహణలో భాగంగా జెండాను ఆవిష్కరించి 354వ ఉత్సవాలకు నాంది పలికారు. యోగీంద్ర కళామండపంలో జ్యోతి ప్రజ్వలన చేసి పీఠాధిపతి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు గోపూజ, అశ్వపూజ, లక్ష్మీపూజ నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఏఏవో, మేనేజర్లు, క్యాష్ సెక్షన్, ఇంజనీర్ సెక్షన్, వీఆర్వో, పీఆర్వో సెక్షన్ కార్యాలయాలకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చి అక్కడ ఉన్న అధికారులను పీఠాధిపతి ఆశీర్వదించారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను ఊంజల మండపంలో ఊయలలో ఏర్పాటు చేసి ఊరేగించి ధాన్యపూజ చేశారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, రజత గజవాహనం, బంగారు, నవరత్నాల రథంపై ఊరేగించిన దృశ్యం భక్తులను కనువిందు చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి మొదటి రోజు ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఈఈ సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సీఆర్వోలు విజయేంద్రాచార్, బద్రీనాథ్, అనంతపురాణిక్, రవికులకర్ణి, జేపీ స్వామి, జయతీర్థాచార్, ఏఈ బద్రీనాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, డీఎం ఆనందరావు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ భక్తులు, మఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఆరాధనోత్సవాల్లో మొదటి రోజు శుక్రవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో మాలూరుకు చెందిన విద్వాన్ ప్రసన్న కోర్పితో దాసవాని సాహిత్యం, ధర్మవరానికి చెందిన లలిత కళానికేతన్ నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. అనంతరం కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మిగతా 7వ పేజీలో


దాతలతో కలిసి పుష్కరిణిలో విహరిస్తున్న పీఠాధిపతి


కూచిపూడి నృత్యం చేస్తున్న నెల్లూరుకు చెందిన కళాకారులు

ప్రకృతితో అను'బంధం'



- నానాటికీ అంతరించిపోతున్న గిరిజన సంతతి
- కాగితాలకే పరిమితమైన సంక్షేమం
- ఐటీడీఏలకు నిధులపై స్పష్టత లేదన్న విమర్శలు
- నేటికీ అందని వైద్య సదుపాయాలు
- ఆధునిక పోకడలతో సంస్కృతిని కాలరాస్తున్నవైనం

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆత్మకూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతితో గిరిజనుల అనుబంధం వెలకట్టలేనిది. ప్రకృతిలో మమేకమై జీవనం సాగిస్తుంటారు. ప్రపంచంలోనే అతి త్వరగా అంతరించిపోతున్న ఆదివాసి చెంచు తెగ ఈ నల్లమలలోనే ఇంకా ఊపిరిపీల్చుకుంటూ మనుగడ సాగిస్తోంది. నానాటికీ గిరిజన సంతతి తగ్గుతున్నప్పటికీ గిరిపుత్రుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. గిరిజన సంక్షేమం కోసం కేటాయించిన నిధులు దారిమళ్లితున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక ఆదివాసీ తెగలు ఉన్నప్పటికీ మనదేశంలోని నల్లమల అడవుల్లో ఆదివాసీ చెంచు గిరిజన తెగమూలాలు ఇంకా మిగిలి ఉన్నాయి. ప్రకృతితో మమేకమై వైవిధ్యమైన జీవనాన్ని నల్లమలలోని పలు గూడేల గిరిజనులు సాగిస్తున్నారు.


1982లో కమిషన్ ఏర్పాటు..

ఆదివాసీ గిరిజన సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని 1982లో తొలిసారిగా ఐక్యరాజ్యసమితి(ఐరాస) నడుంబిగించి ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. గిరిజన జాతులను సంరక్షించాలన్న నేపథ్యంలో వివిధ దేశాల ప్రతినిధులతో చర్చలు సాగించి 1996 ఆగస్టు 9న ఆదివాసీ గిరిజన హక్కుపై ఐరాస కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు ఐరాస సభ్యత్వం వున్న సుమారు 80 శాతం దేశాల ప్రతినిధులు ఆమోదం వ్యక్తం చేయడం గమనార్హం. ప్రతిదేశంలో కొత్త సవరణలతో ఆదివాసీ గిరిజనులకు ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించారు. మనదేశ రాజ్యాంగంలో 5షెడ్యూల్‌లో 244(1) ఆర్టికల్, 6వ షెడ్యూల్డ్‌లో 244(2) ఆర్టికల్‌ను రూపొందించి వాటికి సంబంధించిన విశేష, విశిష్ట అధికారులను ఆయా రాష్ట్రాల గవర్నర్లకు కల్పించింది. అలాగే రాష్ట్రాల శాసనసభలతో కూడా సంబంధం లేకుండా ఏకపక్ష తీర్మానం చేసే అధికారాన్ని సైతం గవర్నర్లకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. ఈ విషయంలో ఇప్పటి వరకు నల్లమల గిరిజనుల సంక్షేమానికి ఏ ఒక్క గవర్నర్ చొరవ తీసుకోకపోవడం గమనార్హం. ఐక్యరాజ్యసమితి సూచన మేరకు 1982లోనే మనదేశంలోని శ్రీశైలం ఐటీడీఏ ఆవిర్భవించినప్పటికీ చెంచుల జీవన ప్రమాణాలు ఏమాత్రం మెరుగుపడలేదు. అసలు ఐటీడీఏలకు కేటాయించిన నిధులు ఏవిధంగా ఖర్చుచేస్తున్నారో కూడా స్పష్టత లేదన్న విమర్శలు ఉన్నాయి.

10వేల జనాభా ఉంటుందని..

నల్లమల గిరిజనుల్లో పోషకాహార లోపం, రక్తహీనత, క్షయవ్యాధి, శిశుమరణాలు సంభవించడంతో చెంచుల సంతతి క్షీణించిపోతోంది. నంద్యాల జిల్లా పరిధిలో 14 మండలాల్లో 48 చెంచుగూడేలు ఉన్నాయి. వాటిలో సుమారు 2951 గిరిజన కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 10వేల గిరిజన జనాభా ఉంటుందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటికి కేవలం 12 చెంచుగూడేలకు మాత్రమే పూర్తిస్థాయిలో ఆరోగ్య సదుపాయం కల్పిస్తుండగా మిగతా గూడేలకు అంతంతమాత్రంగానే ఆరోగ్య సేవలు అందుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రత్యేకించి గిరిజనులు రక్తహీనత టీబీ, కుష్టు, మలేరియా, సీజనల్ జ్వరాలు, చర్మవ్యాధులు వంటి రోగాలతో బాధపడుతున్నారు.

మిగతా 6వ పేజీలో


పెంపుడు జంతువులతోనే చెంచుల జీవనం

పుస్తకం.. జ్ఞాన భాండాగారం

- మంచి పుస్తకం జీవితానికి మార్గదర్శకం
- గ్రంథాలయాలకే పరిమితమవుతున్న మంచి పుస్తకాలు
- తగ్గిపోతున్న పుస్తక పఠనాభిలాష
- నేడు జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం



కర్నూలు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): 'అక్షర రూపం దాల్చిన ఒక్క సిరాచుక్క.. లక్ష మెదళ్లకు కదలిక..!' అంటారు ప్రముఖ కవి, దివంగత కాళోజీ నారాయణ రావు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుస్తకాలు చదివి అపారమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకున్నారు. గ్రంథ పఠనానికే అగ్ర తాంబూలం ఇచ్చి, భోజనం చేయడం మర్చిపోయిన సందర్భాలెన్నో తన జీవితంలో ఉన్నాయని ఆయనే పలుసందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఒకప్పుడు 'పుస్తకం హస్తభూషణం' అని చేతిలో పుస్తకంతో ప్రతి ఒక్కరూ కనిపించేవారు. ఈ పుస్తకం చదివావా? అంటూ వాకబు చేసి ఆ పుస్తకాలు కొని చదివించే వారు. ఇళ్లలోనూ మంచి పుస్తకాలు అందుబాటులో ఉండేవి. కానీ మారుతున్న కాలంలో పుస్తక పఠనాభిలాషే తగ్గిపోతోంది. మంచి పుస్తకాలన్నీ గ్రంథాలయాలకే పరిమితమవుతున్నాయి. ఒకప్పుడు కాలక్షేపానికే కాదు, మంచి విజ్ఞాన సముపార్జనకు ఉపయోగపడిన పుస్తకాలు నేడు సెల్‌ఫోన్ల ప్రభావంతో మరుగున పడిపోతున్నాయి. విద్యార్థులు, యువత కేవలం మార్కుల కోసమే, ర్యాంకుల కోసమే పాఠ్యపుస్తకాల వరకే పరిమితం అవుతున్నారని సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాలకు వెళ్లి..

నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి కనీసం ఒక గంట చదవడంతో మంచి ప్రయోజనాలు కలుగుతాయని సాహితీవేత్తలు చెబుతున్నారు. నిద్రలేమి సమస్యతో కొట్టుమిట్టాడే నేటి తరుణంలో పుస్తక పఠన ఆవశ్యకతను గుర్తుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు చెబుతున్నారు. పుస్తకం చదువుతూ నిద్రాదేవి ఒడిలోకి ఒరిగిపోయే సౌఖ్యాన్ని నేటి యువత గుర్తించకపోవడం శోచనీయమని పెద్దలు చెబుతున్నారు.

సృజనాత్మకతను వెలికితీసే శక్తి..



మనుషుల్లో సృజనాత్మకతను వెలికితీసే శక్తి పుస్తకాలకు ఉంది. చదువుతున్నంత సేపూ మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లి మానసిక ఒత్తిడిని తగ్గించగల దివ్య ఔషధం పుస్తకమే. వినోద, విజ్ఞానాలను పంచడమే కాకుండా, విస్తృత సమాచారాన్ని అందించే సాధనాలు పుస్తకాలు.

● డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కవయిత్రి, కర్నూలు

విజ్ఞాన వెలుగులు నింపే దివ్వెలు



పుస్తకాలు మన అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞాన వెలుగులు నింపే దివ్వెలు. ఎందరో మేధావుల అనుభవాలు, జ్ఞాన సంపద పుస్తకాల్లో అక్షర రూపంలో నిక్షిప్తమై ఉంటుంది. చరిత్రను పుస్తకాల ద్వారానే ఎలా తెలుసుకుంటామో, విజ్ఞాన సంబంధ అంశాలను పుస్తకాల ద్వారానే తెలుసుకుంటాం.

● జి. విజయసారథి, హెచ్ఎం జడ్పీహెచ్ఎస్, గూడూరు

రక్షాబంధం

- అనుబంధానికి ప్రతీక..
- ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి పూజలు
- మార్కెట్లలో సందడే సందడి
- నేడు రాఖీ పౌర్ణమి





అనుబంధానికి ప్రతీక.. ఆత్మీయత, అనురాగాలకు చిహ్నం రక్షాబంధన్.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. శ్రావణ మాసం అంటేనే పర్వదినాల సమాహారం.. అందునా శ్రావణ మాసం వచ్చిందంటే చాలు వెల్లివిరిసే భక్తి భావంతో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపిస్తుంది. ఈమాసంలో వచ్చే శ్రావణ పౌర్ణమికు ఎంతో ప్రత్యేకత ఉంది. పౌర్ణమి చంద్రుడివలే అందరి జీవితాలు నిండుగా శోభించాలని.. సుఖ సంతోషాలతో వెల్లివిరియాలని కోరుకుంటూ ఇతరులకు రాఖీ కట్టడం ఆనవాయితీ. కనుకనే ఇది రాఖీ పౌర్ణమిగా ప్రసిద్ధి చెందింది. రాఖీ అంటేనే రక్కున గుర్తొచ్చేది అక్కా చెల్లెళ్లు, అన్న తమ్ముళ్లు బాగుండాలని రాఖీలు కట్టడం, తియ్యని మధురమైన బహుమతులు పొందడం ఇలా అనాదిగా వస్తున్న సంప్రదాయమే. ఇది ఈనాటిది కాదు సనాతనంగా వస్తున్న ఆచారమని పురాణాల్లో సైతం మనకు కనిపిస్తుంది. నేడు 'రాఖీ పౌర్ణమి' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు కల్చరల్/ కొలిమిగుండ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఏకైక వేడుక 'రక్షా బంధన్'(రాఖీ). అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనురాగాల సన్నిధిగా నిలుస్తుంది ఈ వేడుక. శనివారం ఉమ్మడి జిల్లాలోని హైందవ కుటుంబాలు ఈ వేడుకను ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు కట్టే రాఖీలు సిద్ధం చేసుకున్నారు. రక్షా బంధన్ ఉత్తరాది రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోనూ దశాబ్దాల కాలంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు, రాజస్థానీయులు, గుజరాతీయులు స్థిరవాసులుగా నివసిస్తున్నారు. ఈనేపథ్యంలో వేడుక సందడి బాగా కనిపించనుంది. మార్కెట్లో వేడుక సందర్భంగా విభిన్న రకాలు, డిజైన్లలో రక్షా బంధన్‌లు వ్యాపారులు అమ్మకాలకు పెట్టారు.

శ్రావణ పౌర్ణమి సందడి...

ఏడాది పాటు వచ్చే ద్వాదశి పౌర్ణమిల్లో శ్రావణ పౌర్ణమికి ప్రత్యేకత ఉంది. ఈమాసంలో విచ్చేసే పౌర్ణమిని రాఖీ పౌర్ణమి, శ్రావణ పూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ వంటి పేర్లతో పిలుచుకుంటారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, వ్రతాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి షిరిడీ సాయిబాబా ఆలయాల్లో, పుట్టపర్తి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈరోజున యజ్ఞోపవీతాలు (జంధ్యాలు) ధరించేవారు పాతది వదలి కొత్తది ధరిస్తారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా శైవ, వైష్ణవ ఆలయాల్లో దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తారు.

సోదర బంధానికి ప్రతీక రాఖీ

● ఎంపీ బైరెడ్డి శబరి



కేంద్ర మంత్రికి రాఖీ కడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర బంధానికి ప్రతీక రాఖీ అని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఎంపీల అల్పాహార విందులో పాల్గొన్న ఆమె పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజీజుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రక్షాబంధన్‌తో ఒక గౌరవం, నమ్మకం అనే బంధానికి ప్రతీక అన్నారు.

ఈఏడాది రాఖీ పౌర్ణమికి ప్రత్యేక విశిష్టత..

ఈఏడాది రాఖీ పౌర్ణమికి ప్రత్యేక విశిష్టత ఉన్నట్లు వేద పండితులు పేర్కొంటున్నారు. 1930 తర్వాత మళ్లీ ఈఏడాది రాఖీపౌర్ణమికు అంతటి ప్రాముఖ్యత ఉందని, అరుదైన మహా సంయోగం ఏర్పడే దినంగా పండితులు చెబుతున్నారు. ఈఏడాది రాఖీ పండుగ రోజు ఇతర శుభ యోగాలు కూడా ఉన్నాయని, లక్ష్మీనారాయణుడిని పూజించి, రాఖీ కడితే శుభ ఫలితాలు ఉంటాయని వేద పండితులు ఆలూరు రాఘవేంద్రప్రసాదు వెల్లడించారు.





విక్రయాల సందడి..



రక్షాబంధన్ దినోత్సవం సందర్భంగా నగరంలో రాఖీల విక్రయాల సందడి బాగా కనిపించింది. శుక్రవారం రక్షాబంధనాల కోసం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రాల్లో మహిళలు తమకు నచ్చిన రక్షాబంధనాల కొనుగోళ్లకు బారులు దీరారు. వ్యాపారులు విభిన్నరకాల రాఖీలను అందుబాటులో పెట్టారు. పూసలు, ముత్యాలు, విభిన్న రకాల అలంకరణ వస్తువులతో ఆకర్షణీయంగా రూపొందించిన రాఖీలను విక్రయాలకు పెట్టారు. రూ.20 నుంచి రూ.250 వరకు వివిధ ధరల్లో, విభిన్న రూపాల్లోని రాఖీలను ప్రజలు కొంటున్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

- కామేశ్వరీదేవికి ప్రత్యేక అలంకరణ
- పాల్గొన్న వందలాది మంది మహిళలు





మహానందిలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

మహానంది, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మూడో శుక్రవారం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రధాన ఆలయంలోని కామేశ్వరీదేవిని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అలంకరించారు. గణపతి పూజా, పుణ్యాహవాచనముతో పాటు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వందలాది మంది మహిళలతో వేదమంత్రాలతో జరిపారు. హాజరైన మహిళలకు దాతలు పసుపు కుంకుమలు అందజేశారు. రెండో ప్రాకారంలోని కోనేరులో వరలక్ష్మీ అమ్మవారిని భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతితో అను'బంధం'

5వ పేజీ తరువాయి



నల్లమల గిరిజన గూడేల్లో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయి. ఆత్మకూరు ప్రాంతం పరిధిలోని బైర్లూటి, శివపురం, కొట్టాలచెరువు, పాలెం చెరువు ప్రాంతాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయి. ప్రత్యేకించి వసతి గృహాలన్నింటిలో పర్యవేక్షణాధికారుల పనితీరుపై అనేక ఆరోపణలున్నాయి. గిరిజనుల కోసం వసతిగృహాలు, పాఠశాలల నిర్మాణానికి కోట్లాది రూపాయాలు కేటాయిస్తున్న ప్రభుత్వం ఆ తర్వాత వాటి పర్యవేక్షణ గాలికి వదిలేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2008 నుంచి 2014 వరకు 848 మంది గిరిజన బాల బాలికలు డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారు. ఐటీడీఏ అధికారిక గణాంకాల్లో మాత్రం విద్యా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నట్లు రికార్డులు ఉండటం గమనార్హం.

ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా..

నల్లమలలో నేటికీ అనేక గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వాటికి చిల్లుపడుతున్నాయి. గిరిజనులకు భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణ చట్టాన్ని నిషేధించింది. వారికి కు.ని. ఆపరేషన్లు చేస్తే, వారిపై శాఖపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు. అయితే ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపంతో చెంచులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నేటికీ చేయించుకుంటూనే ఉన్నారు.

- అటవీ శాఖ కూడా చెంచుల జీవన ప్రమాణాలను అడ్డుకునేందుకు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తుంది. పలు ప్రలోభాలకు గురిచేస్తూ అడవి నుంచి బయటకు పంపించేందుకు అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటుంది.
- చెంచుల నృత్యాలు, ఆటపాటలు సాంప్రదాయబద్ధంగా ఉండేవి. అయితే ఆధునిక పోకడలతో వారి సంస్కృతిని కాలరాసేందుకు ప్రభుత్వ శాఖలే ముందుండి చొరవ తీసుకోవడం బాధాకరం. నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడేంలో మాత్రంలో నేటికీ గిరిజన ఆచారాలు అమలవుతున్నాయి. వీరిని కూడా అడవిలో నుంచి బయటకు తీసుకురావాలని అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ వారు అడవిని వదిలి బయటకు వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఈఅంశంపై ఇటీవల కలెక్టర్ రాజకుమారిని కూడా చెంచులు సంప్రదించారు.

గిరిజనుల అరణ్య రోదన..

ఐటీడీఏల ద్వారా నిధులను కేటాయిస్తున్నప్పటికి ఆ నిధులు గిరిజనుల దరికి చేరడం లేదు. పలు గూడేంలకు రహదారి సదుపాయాలు లేకపోవడంతో పాటు మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీసం విద్యా, వైద్యం, ఉపాధి సౌకర్యాలు కూడా గిరిజనులు అరణ్య రోదనతో కాలం వెల్లదీస్తున్నారు.

నంద్యాల జిల్లాలో గిరిజన వివరాలు పరిశీలిస్తే..

చెంచుగూడేలు	: 48
జనాభా	: సుమారు 10వేలు
కుటుంబాలు	: 2,951
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	: 20
గిరిజన జూనియర్ కళాశాలలు	: 03



ప్రకృతిలోనే జీవన విధానాలు

మనకోసం.. మనమిత్ర

- 700 సేవలు ప్రజలకు అందుబాటులో
- ప్రజలకు మెరుగైన సేవల కోసం ప్రభుత్వం కృషి
- ఈనెల 15న ప్రారంభం
- ప్రభుత్వ వాట్సప్ నెంబర్: 9552300009

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధే.. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే మొదటిసారిగా 'మనమిత్ర' వాట్సప్ గవర్నెన్స్ అమలు చేయనుంది. సచివాలయాల పరిధిలో 26శాఖలకు సంబంధించి 700సేవలు ప్రజలు అందుకోవచ్చు. ప్రతిసేవ సకాలంలో పొందవచ్చు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. ప్రభుత్వం వాట్సప్ నెంబర్: 9552300009ను 'మనమిత్ర' కోసం కేటాయించింది. ఈసేవల గురించి సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించి పొందేలా చేయాలి. ఈనెల 15వ తేదీన 'మన మిత్ర'ను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.



రుద్రవరంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు (ఫైల్)

రుద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే మొదటిసారిగా మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ఈ నెల 15న అమల్లోకి తెచ్చారు. 700 సేవలు ప్రజలకు అందుబాటులో రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు సచివాలయాల నుంచి అందించేందుకు వాట్సప్ గవర్నెన్స్ అమలు చేసింది. హాయ్ అనండి.. హాయిగా సేవలు పొందండి, వాట్సప్ గవర్నెన్స్ నెంబరు 95523 00009 ఏర్పాటుచేసింది.

సేవలు ఇలా..



సచివాలయాల పరిధిలో 26శాఖలకు సంబంధించి 700సేవలు ప్రజలు అందుకోవచ్చు. ప్రతి సేవ సకాలంలో పొందవచ్చు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. జిల్లాలో 409 గ్రామ సచివాలయాలు, 28 మండలాల్లో ఉన్నాయి. వార్డు సచివాలయాలు ఆరు మున్సిపాలిటీల్లో 107 ఉన్నాయి. వీటి పరిధిలో నివసిస్తున్న ప్రజలు మనమిత్ర, వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించి సేవలు పొందవచ్చు. ప్రతినెలా 5వ తేదీన వాట్సప్ గవర్నెన్స్ పైన గ్రామ ప్రజలతో కలుపుకుని సచివాలయ ఉద్యోగులు ర్యాలీ చేయాలి. ఈసేవల గురించి ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించి పొందేలా చేయాలి.

ఇలా ఉపయోగించండి

ప్రభుత్వం వాట్సప్ నెం.95523 00009ను మనమిత్ర పేరుతో సేవ్ చేసుకోండి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపి చాట్ చేయడం ప్రారంభించండి. మీకు కావాల్సిన సేవలు ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీకు వాట్సప్‌లో ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌లో లభ్యమై అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీరు ఒకసేవను ఎంపిక చేసుకోండి. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ఎలక్ట్రిసిటీ బిల్ పేమెంటు.. కావాల్సిన వివరాలు పొందండి మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్‌బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. మీ ఆధార్‌నెంబరు, మొబైల్ నెంబరు, లేదా సర్వీసు రిక్వెస్ట్ ఐడీలాంటివి. ఈ వివరాలు టెక్స్ రూపంలో లేదా వాయిస్ రూపంలో ఇవ్వండి. మీరు ఇచ్చిన వివరాలను ఒకసారి తనిఖీ చేసి తరువాత అందులో సిస్టం మీకు రియల్ టైం అప్‌డేట్స్ లేదా ఒక కన్ఫర్మేషన్ సందేశం పంపుతుంది. చెల్లింపు కోసం భద్రతతో కూడిన ఒక పేమెంటు లింకును కూడా పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోండి. వాట్సప్ గవర్నెన్స్‌లోని చాట్‌బాక్స్‌లో మీ ధ్రువీకరణ పత్రాలు, రశీదులు, లేదా అక్నాలెడ్జ్ మెంటు రూపొందించి మీకు అందిస్తుంది.

ప్రిన్సిపాల్‌కు మదర్ థెరిస్సా సేవా పురస్కార్



నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఇంటర్నేషనల్ మదర్ థెరిస్సా సేవా పురస్కార్‌కు ఎంపికయ్యారు. ఈ అవార్డును శుక్రవారం ఈమెయిల్ ద్వారా అందజేశారు. మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు గానూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యధికంగా అడ్మిషన్లుకు విశేషంగా కృషి చేసినందుకు గానూ ఈ అవార్డును ఫైక్స్ ఇంటర్నేషనల్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలిపారు.

శ్రీమఠానికి 1,001 బస్తాల బియ్యం

● రూ. 12 లక్షలు విరాళం



విరాళం ఇచ్చిన బియ్యం బస్తాలు

మంత్రాలయం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుగుణ బిల్డర్ అండ్ డెవలపర్స్ వారు 1001 బస్తాల (26 కేజీల బస్తాలు) బియ్యం విరాళంగా ఇచ్చారు. అదే విధంగా శ్రీమఠం ఆరాధనోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రాలయం కెనరా బ్యాంకు తరఫున మేనేజర్ నాగార్జున, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ రూ.10లక్షల చెక్కు, ఆరాధనోత్సవాలకు కర్ణాటక బ్యాంకు తరఫున మేనేజర్ బీవీ కార్తీక్ రూ.2లక్షల డీడీని విరాళంగా ఇచ్చినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్టోర్ ఇన్‌చార్జిలు రవికులకర్ణి, అనంత రాఘవేంద్ర పురాణిక్, నారాయణరావు, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారిణి నృత్యప్రదర్శన

అంగరంగ వైభవంగా.. సప్తరాత్రోత్సవాలు ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

ఉత్సవాల్లో నేడు..

ఆరాధన మహోత్సవాల్లో జరిగే రెండో రోజు శనివారం తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం, ఉదయం 6 నుంచి 8.15 గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, పంచామృతాభిషేకం, 8.15 నుంచి 8.30 గంటల వరకు గంటలకు టీటీడీ నుంచి పట్టువస్త్రాలు సమర్పణ ఉంటుంది. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అనంతరం యజుర్వేద నిత్య నూతన ఉపకర్మ పూజలు, 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహామంగళహారతి, తీర్థప్రసాదాలు, సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం, రాత్రి 8.30 గంటలకు రథోత్సవాలు, శాకోత్సవం, ఊంజల సేవ, రజిత మంటపోత్సవం నిర్వహించనున్నారు.

నేటి సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరాధనలో రెండో రోజు శనివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు చెన్నై చెందిన విధీషి కన్యాకుమారిచే వాయిలీన్ వాయిద్యం, 6.30 నుంచి 8 గంటల వరకు పుత్తూరు చెందిన విద్వాన్ పుత్తూరు జగదీష్‌చే దాసవాని సాహిత్యం, ఉడిపికి చెందిన భార్గవి మృత్యతాండ వారిచే భరతనాట్యం నిర్వహించనున్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



గోవులకు పూజలు చేస్తున్నపీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు



పూజలు చేస్తున్న పీఠాధిపతి, మఠం అధికారులు

వ్యభిచార గృహంపై దాడి



నిందితులను చూపుతున్న పోలీసులు

కర్నూలు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు చేశారు. సీఐ విక్రమసింహ ఆధ్వర్యంలో ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, మోహనకిషోర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు చేసి 13 మందిని అరెస్టు చేశారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇందులో యువతుల నుంచి విటులను ఆకర్షిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈదాడులు చేశారు. కల్లూరు, నందికొట్కూరు, శరీన్‌నగర్, బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురానికి చెందిన విటులతో పాటు కర్నూలు బాలాజీనగర్, సంతోష్‌నగర్, బనగానపల్లె, విజయవాడకు చెందిన మహిళలతో బాలాజీనగర్‌కు చెందిన ఆమె వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు తేలింది. వీరందరినీ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వ్యభిచార గృహాలు నిర్వహించేందుకు శివారు ప్రాంతంలో తాము కూడా ఓ ఫ్యామిలీ అంటూ అద్దెకు తీసుకుని ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతర ప్రాంతాల నుంచి యువతులను రప్పించి సెల్ ఫోన్లలో వాట్సప్ ద్వారా యువతుల ఫొటోలు పంపిస్తూ వారిని ఆకర్షిస్తూ ఈ వృత్తి నిర్వహిస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. వీరితో పాటు 8 మంది యువతులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి సొంతూర్లకు పంపించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆదోని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇస్వీ-కుప్పగల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు ప్రమాదంలో 45ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... ఇస్వీ-కుప్పగల్ రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ. 507/23-25 మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. మృతుడి వద్ద మద్రాసు నుంచి ముంబై వరకు ప్రయాణించేందుకు టికెట్ కొనుగోలు చేసి జేబులో ఉంచుకున్నట్లు తెలిపారు. అతడిని గుర్తించేందుకు ఎలాంటి ఇతర ఆధారాలు లేవని, కుడిచేయి రెట్టపై ఆంజనేయస్వామి ట్యాటూ మార్క్ ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం డబ్బుల కోసం తల్లి హత్య



ఎల్లమ్మ(ఫైల్)

కర్నూలు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం డబ్బుల కోసం తల్లిని హత్య చేసిన ఘటన కర్నూలు నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుధవారపేటలో జరిగింది. రుద్రాక్షల ఎల్లమ్మ (70) అనే వృద్ధురాలిని ఆమె కొడుకు జమ్మన్న హత్య చేశాడు. వివరాలివీ.. నంద్యాల చెందిన రుద్రాక్షల ఎల్లమ్మ, తన కొడుకు జమ్మన్న కర్నూలు బుధవారపేటలో నివాసం ఉంటున్నారు. జమ్మన్న వంట మాస్టరుగా పని చేస్తుంటాడు. ఇటీవల మద్యానికి బానిసై ఇంటి వద్దనే ఉంటూ నిత్యం తల్లిని హింసించేవాడు. శుక్రవారం తెల్లవారుజామున మద్యం కోసం డబ్బులు కావాలని తల్లితో గొడవ పడ్డాడు. మంచం మీద పడుకున్న ఆమెను నోరు, ముక్కు మూసి ఊపిరాడకుండా చేశాడు. తర్వాత చెవికి వున్న బంగారు కమ్మలు లాక్కెళ్లాడు. ఊపిరి ఆడక వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వృద్ధురాలి మృతదేహానికి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. జమ్మన్నపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

ఎక్సైజ్ మెరుపు దాడులు



నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

కర్నూలు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): చీప్ లిక్కర్ తయారీ కేంద్రంపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు చేశారు. శుక్రవారం రాత్రి ముందస్తుగా అందిన సమాచారం మేరకు కర్నూలు మండలం ఉల్చాల క్రాస్‌లో ఎక్సైజ్ శాఖ సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ దాడులు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ కలాం నుంచి సేకరించిన వంద బండిల్స్, 10 వేల లిక్కర్ ఖాళీ సాచెట్లు, రెక్టిఫైడ్ స్పిరిట్, ఫుడ్ కలర్, అమృత్స్ సిల్వర్‌కప్స్ రేర్ ఇండియన్ బ్రాందీ, పది లీటర్ల సారాను కారులో తరలిస్తుండగా పింజరి మిన్నెల్లాను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కల్తీమద్యం తయారు చేయడం, అమ్మడం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నట్లు గుర్తించారు. మిన్నెల్లాను అదుపులోకి తీసుకోగా హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ కలాం, కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన చంద్రబాబును అరెస్టు చేయాల్సి ఉందని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రెహనా, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈవో మద్దిలేటి శుక్రవారం తెలిపారు. ఈవో మద్దిలేటి మాట్లాడుతూ విజయవాడ దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 7న నూతన ధర్మకర్తల మండలి దరఖాస్తుల కోసం ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈనెల 8 నుంచి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలి నియా మకానికి 20 రోజుల్లోపు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారాలను కర్నూలు దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాల యంలో అందజేయాలని కోరారు.

దళిత యువకుడిపై వైసీపీ క్రూరత్వం



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దళిత యువకుడిపై భూమన కరుణాకరరెడ్డి అనుచరుడు, వైసీపీ నాయకుడి దాడి క్రూరమైందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. డీసీఎంహెచ్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, బేతం కృష్ణుడు పాల్గొన్నారు. సోమిశెట్టి మాట్లాడుతూ దాడి చేసిన వైసీపీ రౌడీలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు తీవ్రంగా ఉండేవని, వాటన్నింటికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ద్వేషమే కారణమన్నారు. కేవలం ఓట్ల కోసం వారిని ఉపయోగించుకున్న జగన్, వారిపై దాడులను ప్రోత్సహించారన్నారు. తిరుపతిలో దళిత యువకుడిపై భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు, అనుచరుల దాడి క్షమించరానిదన్నారు.

వైసీపీ దళిత వ్యతిరేకి : తిక్కారెడ్డి



వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నామనే భ్రమలోనే ఇంకా దాడులు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదని మండిపడ్డారు. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దళిత యువకుడిపై జరిపిన దాడి సిగ్గుచేటన్నారు. వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అని చెప్పకనే వారి చేష్టలు రుజువు చేశాయన్నారు. అరాచక సంఘటనలను ప్రభుత్వం ఉపేక్షించబోదని, నిందితులకు కఠిన శిక్షపడాలని డిమాండ్ చేశారు.

దళితులను టార్గెట్ చేసుకున్న వైసీపీ : బస్తిపాటి



వైసీపీ మొదటి నుంచి దళితులను టార్గెట్ చేస్తూనే ఉందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల రాష్ట్రంలో అరాచకాలు సృష్టించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు నేటికీ అదే పంథాను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. గతంలో మాస్కులు అడిగిన పాపానికి దళిత వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్‌పై దాడిచేసి ఆయన చావుకు కారణమన్నారు. మరో దళిత డ్రైవర్‌ను హత మార్చి శవాన్ని డోర్ డెలివరీ చేశారన్నారు. తాజాగా బైక్ అద్దె చెల్లించలేదని పవన్‌కుమార్ అనే యువకుడిపై దాడికి పాల్పడడం దారుణమన్నారు.

పోస్టుమార్టం చేయకుండా వైద్యుడి నిర్లక్ష్యం



ఆసుపత్రిలో వైద్యులతో బంధువుల వాగ్వాదం

- బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల ఆగ్రహం.. ఆసుపత్రి వద్ద బైఠాయింపు
- సీఐ, ఎస్ఐ జోక్యంతో పోస్టుమార్టం నిర్వహణ

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పోస్టుమార్టం చేయకుండా వైద్యుడు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రి వద్ద బైఠాయించారు. వివరాలివీ.. తాడిపత్రికి చెందిన కత్తి మారెన్న గత 5 సంవత్సరాలుగా పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తాగుడుకు బానిసై ఈనెల 7న ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఆయనకు భార్య సుంకమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శుక్రవారం ఉదయం మృతదేహం డికంపోజ్ అయిందని, తాను పోస్టుమార్టం చేయనని, కర్నూలు తీసుకెళ్లాలని వైద్యుడు మహబూబ్ బాషా చెప్పారు. దీంతో వైద్యుడి తీరుపై బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు మండిపడ్డారు. ఆసుపత్రి వద్ద బైఠాయించారు. దీంతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి జోక్యం చేసుకొని ఇన్‌చార్జి డాక్టర్ సుజిత, వైద్యుడు మహబూబ్ బాషాతో మాట్లాడారు. చివరకు వైద్యుడు పోస్టుమార్టం చేయడానికి ఒప్పుకున్నారు. అయినప్పటికీ వైద్యుడు నిర్లక్ష్యంగా క్యాజువా లిటీలో కూర్చో వడం సమయాన్ని వృథా చేస్తుండడంతో బాధితులు కోపోద్రిక్తుల య్యారు. మృత దేహాన్ని తాడిపత్రికి తీసుకెళ్లాలని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మండిపడ్డారు. దీంతో చివరకు వైద్యుడు మహబూబ్ బాషా మారెన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు



నేత్రాలను ఐబ్యాంకు సిబ్బందికి అందజేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో ఇరువురి జీవితాల్లో రెడ్‌క్రాస్ జిల్లా మాజీ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండీ మారుతీకుమార్ తండ్రి రెంటాల లక్ష్మీనారాయణ వెలుగులు నింపారు. గురువారం ఆయన హార్ట్ ఎటాక్‌తో ఆకస్మికంగా మృతిచెందారు. రెడ్‌క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురురాజీ లక్ష్మీనారాయణ మృతి విషయాన్ని రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు.

ఆయన కర్నూలు రెడ్‌క్రాస్ ఐబ్యాంకు బృందానికి తెలియపర్చగా ఐబ్యాంకు సిబ్బంది శుక్రవారం ఉదయం లక్ష్మీనారాయణ రెండు నేత్రాలను సేకరించారు. ఈసందర్భంగా మారుతీకుమార్ మాట్లాడుతూ తన తండ్రి నేత్రాలు ఇంకా సమాజాన్ని చూడాలనే ఆలోచనతోపాటు మరో ఇద్దరి జీవితాలకు వెలుగును ప్రసాదించేందుకు నేత్రాలను దానం చేశామన్నారు. ఆనంద్‌గురురాజీ మాట్లాడుతూ చనిపోయిన శరీరాన్ని వెంటనే ఫ్రీజర్‌లో ఉంచినట్లయితే దాదాపు 12గంటల వరకు నేత్రాలను సేకరించవచ్చునన్నారు. ఫ్రీజర్ అందుబాటులో లేకుంటే సిప్లాక్స్ ఐడ్రాప్స్ ప్రతి అరగంటకు ఒకసారి వేస్తూ ఉంటే ఆరు గంటలకు పైగా నేత్రాలను సేకరించవచ్చునని తెలిపారు.

ఉరుకుంద ఆలయ ఈవో బదిలీ



ఎం.విజయరాజు

కౌతాళం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజును బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గకపోవడంతో రాజకీయ నేతలు ఉన్నట్లుండి ఆలయ ఈవోను తమ పలుకుబడితో బదిలీ చేయించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆలయంలో ప్రస్తుతం స్వామివారి శ్రావణ మాసపు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ పాలన కొనసాగిస్తున్నాడు. అయితే ఇటీవల ఆలయ ఉప ప్రధాన అర్చకుడి మృతికి ఆలయ ఈవో వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడం కూడా ఈవో బదిలీకి కారణమై ఉండవచ్చు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విధుల్లో నిక్కచ్చిగా ఉండటం..

విధులు చేపట్టిన అతి తక్కువ కాలంలోనే దేవాలయంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి హారతులు ఇస్తూ హారతి పళ్లెంలో భక్తులు వేసే కానుకలను హుండీలో వేసేలా చర్యలు చేపట్టారు. అంతేకాక గర్భగుడిలో సీసీలు ఏర్పాటు చేసి పళ్లెంలోని కానుకలను హుండీలో వేయని అర్చకులకు కొందరికి నోటీసులు కూడా జారీచేసి అర్చకులకు కేటా యించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించేలా చేశారు. తలనీలాలు, కొబ్బరి కాయల టెండరుదారులు తమ అక్రమాలకు అడ్డు ఉన్నారన్న కోపంతో తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించి తమకు అనుకూలమైన డీసీలను వేయించుకోవాలని పట్టుపట్టి ఈవోను బదిలీ చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

కసాపురం ఆంజనేయస్వామి దేవాలయ..

ఉరుకుంద ఆలయ ఈవో విజయరాజును అనంతపురం జిల్లా కసాపురం ఆంజనేయ స్వామి దేవాలయ డీసీగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఈవో వాణిని ఈరన్న స్వామి దేవాలయ ఈవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రావణ మాసపు ఉత్సవాల పూర్తి అయ్యేంత వరకు ఈఓ విజయరాజు బదిలీని ఆపాలంటూ భక్తులు కోరుతున్నారు.

డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పన



డ్రోన్ వ్యవస్థను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

- పరిశీలించిన కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎం విద్యాసంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఐఐఐటీ డీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్యసదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోనూ రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి వైద్యసేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ చానల్ సమయంలో అంబులెన్సుకు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.కృష్ణానాయక్, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలి

అన్నిశాఖల అధికారులు తమ కార్యాలయాలకు చెందిన డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈటీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో డాక్యుమెంటు అప్‌లోడు చేసే అంశంపై కలెక్టర్ జిల్లా అధికారులతో, తహసీల్దార్లతో, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు తమ కార్యాలయాలకు సంబంధించిన చట్టాలు, నియమ నిబంధనలు, మెమోలు, జీవోలు సర్క్యులర్లు, ముఖ్యమైన డాక్యుమెంట్లు స్కానింగ్ చేసి ఈటీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడు చేయాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్‌లో ఈ ప్రక్రియ నిర్వహిస్తారని, అధికారులు మూడు రోజుల్లోపు డాక్యుమెంట్లు అప్‌లోడు పూర్తికావాలన్నారు. జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

● ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఎమ్మెల్యే గౌరు చరితకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఓర్వకల్లు సొసైటీ అధ్యక్షుడు సుధాకర్‌రావు, సభ్యులు

ఓర్వకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘాల సొసైటీలకు ఎంపికైన ఛైర్మన్లు, సభ్యులు రైతులకు అందుబాటులో ఉం టూ మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచిం చారు. శుక్రవారం ఓర్వకల్లు సహకార పరపతి సంఘం నూతనంగా ఎంపికైన సొసైటీ అధ్యక్షుడు సుధాకర్‌రావు, మెంబర్లు చెన్నూరు భాస్కర్‌రెడ్డి, కమ్మ రాజశేఖర్ నగరంలోని మాధవీ నగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలి పారు. ఛైర్మన్ సుధాకర్‌రావు మాట్లాడుతూ తమను ఆదరించి నూతన కమిటీని ఎంపిక చేసినందున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలి పారు. ఎమ్మెల్యేకు పూలమాలలు, శాలువతో సన్మానించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్య క్షుడు మోహన్ రెడ్డి, నాయకులు లక్ష్మీ కాంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ కోటేశ్వరరావు, మౌలీశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గూడూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గూడూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల అధ్యక్షురాలు కె.సునీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మధులత తెలిపారు. ఈ సమావేశా నికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పం చ్‌లు, సొసైటీ కార్యదర్శులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

హామీలతో మరోసారి మోసం: వైసీపీ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు కానీ హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగించేందుకు ప్రయత్నిస్తుందని వైసీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ మనోహరి అన్నారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాటా డారు. కూటమి ప్రభుత్వం ఈ నెల 15న ఉచిత బస్సు.. ఉచిత ప్రయాణం అంటూ మరోసారి మహిళలను మోసం చేస్తుందని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో దూర ప్రాంతాలకు ఉండే పుణ్య క్షేత్రాలకు వెళ్లవ చ్చని చెప్పిన కూటమి నాయకులు ప్రస్తుతం కేవలం ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులతో అమలు చేయడం ఏమిటని ఆమె ప్రశ్నిం చారు. కార్పొరేటర్లు జుబేర్ అహ్మద్, షాషావలి పాల్గొన్నారు.

నేడు క్విట్ ఇండియా వేడుకలు

కర్నూలు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు క్విట్ ఇండియా వేడుకలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారం ఉదయం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని బాషా అధ్యక్షతన కొండారెడ్డి బురుజు ఎదుట ఉన్న పార్క్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పి స్తారు. అనంతరం జాతీయ యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

కోడుమూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలంటే ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు స్థానిక కొండపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు బసనన్న, తిక్కన్న, రంజనీ కాంతమ్మ, ఎస్తేర్‌రాణి, చిన్న హనుమంతు, శ్రీనివాసులు, రామ కృష్ణలను సన్మానించారు. హెచ్. తిమ్మన్న మాట్లాడుతూ ఉపాధ్యా యులు విద్యార్థులకు చదువు బాగా బోధించి వారి జీవితాల్లో వెలుగు నింపాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యా యులు గోకారి, నాగరాజరెడ్డి, జనార్ధన్, రాంమోహన్‌రెడ్డి, దేవదాసు, విక్టర్, మహేష్, వెంకటేశ్, గోవిందు పాల్గొన్నారు.

తనిష్క్ వజ్రాభరణాల ఎగ్జిబిషన్ ప్రారంభం

కర్నూలు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లోని తనిష్క్ షోరూంలో వజ్రాభరణాల ఎగ్జిబిషన్‌ను మేనే జింగ్ డైరెక్టర్, ముప్పా ధీరజ్ కృష్ణ, డైరెక్టర్ ముప్పా భరత్, మేనేజర్ ప్రవీణ్‌లు శుక్రవారం ప్రారంభించారు. షోరూం ఎండీ ముప్పా ధీరజ్ కృష్ణ మాట్లాడుతూ తనిష్క్ వజ్రాభరణాల సద్వినియోగం చేసుకోవా లని కోరారు. నగర ప్రజల కోసం తనిష్క్ స్టోర్స్ ఆధ్వర్యంలో డైమండ్, వజ్రాభరణాల ఎగ్జిబిషన్ ప్రారంభించామన్నారు.

పదేళ్ల బాలుడికి అరుదైన ఆపరేషన్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలుడికి కిమ్స్ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడారు. శుక్ర వారం కిమ్స్ వైద్యులు వివరాలు వెల్లడించారు. పిల్లల్లో చాలా అరు దుగా కనిపించే సమస్య క్రానిక్ కాల్సిఫిక్ పాంక్రియాటిస్. పదేళ్ల బాలుడు రితి క్‌కు కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రా లజిస్టు డా.ఎస్.జే జానకీరాం, పీడియాట్రిక్ సర్జన్ డా.ఎం.శ్రీకాం తబాబు, ప్రెస్ ప్రొసిజర్ అనే ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. రితిక్‌కు ఐదేళ్ల నుంచి పాంక్రి యాస్‌లో చాలా పెద్ద సంఖ్యలో రాళ్ల ఏర్పడుతాయి. అయితే రాళ్ల ఏర్ప డటం వల్ల బాలుడికి కడుపు నొప్పి వచ్చేది. ఈ సమస్య ఎక్కువగా కావ డం కిమ్స్ హాస్పిటల్‌కు జూన్ 6వ తేదీ అడ్మిషన్ కాగా, 28వ తేది వైద్యులు ఆపరేషన్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగం గా నగరంలో నేడు విద్యుత్ పరఫరాలో అంతరాయం ఉం టుందని కర్నూలు డివిజన్ ఏడీఈ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్ కోసం రెండో శనివా రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి సహక రించాలని ఆయన కోరారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

నంద్యాల కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో స్వామి అమ్మవార్లకు మహామంగళహారతి అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆల యం నుంచి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుని అక్కడి నుంచి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం, మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూదిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంటుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగుస్తుంది.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బళ్లారి చౌరస్తా, ఉల్చాలరోడ్డులోని వాసవీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవ స్థానంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజ మూర్తి, అర్చకుడు విష్ణు ఆధ్వర్యంలో మహాలక్ష్మీ అమ్మవారికి అష్టోత్తర శతనామ కుంకుమార్చన చేసి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యాలయంలో భరత మాత ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, గుణ్ణంపల్లి నారాయణమ్మ ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు గూడా సుబ్రహ్మ ణ్యం, ఈపూరి నాగరాజు, శివకోటి చంద్రశేఖర్, ఉపేంద్ర నాయక్ సహ కారం అందించారు. నగరంలోని హరిశ్చంద్రనగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో వీహెచ్‌పీ- మాతృశక్తి జిల్లా కన్వీనర్ మాళిగి పావని నిర్వహణలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ముత్తయిదువులు మహాలక్ష్మీ విగ్రహానికి ధూప, దీప నైవేద్యాలతో పూజలు చేసి, వరలక్ష్మీ వ్రత కథను ఆలకించి, మహా మంగళ హారతితో కార్యక్ర మాన్ని నిర్వహించారు. 108 సార్లు మహాలక్ష్మీ అష్టోత్తర శతనామ కుంకు మార్చన, 108 తామరపుష్పాలతో అర్చనలు వైభవంగా చేశారు. అనం తరం 16 రకాల నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మాతృశక్తి, దుర్గావాహిని సంస్థల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. పాతనగరంలోని పేట శ్రీరామాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మాళిగి హనుమేషాచార్యుల ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తులు ఆచరించారు. కార్యక్రమంలో మాధ్వ మహిళా ప్రతినిధులు జాహ్నవి, జ్యోతి, వసుధ పాల్గొన్నారు. మామిదాలపాడులోని గోదాగోకుల క్షేత్రంలో గోదా అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించా రు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు రమేష్ భట్టాచార్య తీర్థప్ర సాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు. పాతనగరంలోని లలితా పీఠంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుం కుమార్చనలు నిర్వహించారు. 108 కలశాలు, 108 మంది ముత్తయిదు వులతో పూజలు చేశారు. వేద పండితుడు మామిళ్లపల్లి రాజేశ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్య స్వామి ముత్తయిదువులకు చీరె, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు.

గూడూరు: మండలంలోని కె.నాగులాపురం సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణమాస సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, తదితర పూజలు చేశారు. అమ్మవారి ఆలయం ఆవరణలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, సిబ్బంది కేశవ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.





కె.నాగులాపురం సుంకులాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వేడుకల్లో పాల్గొన్న భక్తులు, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..



వాసవీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు



పేట రామాలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు చేయిస్తున్న ప్రధానార్చకులు





త్యాగరాజ సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, గోదాగోకుల క్షేత్రంలో..

ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన హర్ ఘర్ తిరంగా క్యాండిల్ లైట్ కార్యక్రమంలో కలెక్టర్ తన సతీమణితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా (ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా) కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మన దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం గురించి తెలుసుకో వడం ద్వారా దేశం పట్ల గౌరవం పెంచు కోవాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో బాధ్యతాయు తంగా మెలగడం కూడా దేశభక్తిలో భాగమేని అన్నారు. హర్ ఘర్ తిరంగా ప్రదర్శనలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీపీవో భాస్కర్, సీఈవో సెట్కూరు వేణుగోపాల్, పీఆర్ ఎస్ఈ మద్దన్న, జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, డీఈవో శామ్యూ ల్‌పాల్ అధికారులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగ క్యాండిల్ లైట్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా శుక్రవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కల్లూరు అర్బన్ 16 వార్డుల పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసు కుంటున్నా మన్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు.

‘విద్యా మిత్ర’పై ఆరా



ఓర్వకల్లులోని కేజీబీవీలో పుస్తకాలను పరిశీలిస్తున్న స్టేట్ టెక్ట్స్ బుక్స్ డిప్యూటీ డైరెక్టర్ రాము

ఓర్వకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన విద్యామిత్ర కిట్లు అందాయా లేదా అనే వాటిపై శుక్రవారం ఓర్వకల్లులోని ఎంఆర్‌సీ, కేజీబీవీ పాఠశాలలను స్టేట్ టెక్ట్స్ బుక్స్ డిప్యూటీ డైరెక్టర్ రాముతోపాటు జిల్లా టెక్ట్స్ బుక్స్ మేనేజర్ సరళ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎంఆర్‌సీ భవనంలో ఉన్న పుస్తకాలు, అటెండెన్స్ బుక్స్ మిగులు పుస్తకాల గురించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు అసెన్‌మెంటు బుక్స్ అందాయా లేదా అని విద్యార్థులను తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యామిత్రలో భాగంగా బ్యాగులు నోటు పుస్తకాలు, టెక్ట్స్‌బుక్స్, షూస్, సాక్సులు, యూనిఫామ్స్‌పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంఈవో ఓంకార్ యాదవ్ ఉన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు అమృతం తో సమానమని కర్నూలు మెడికవర్ హాస్పిటల్ చెందిన పీడీయాట్రిక్ ప్రసూతి వైద్యులు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం హాస్పిటల్‌లో తల్లుల పిల్లలకు న్యూట్రిషన్‌తో కూడిన బేబీ కిట్లను మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి అందించారు. పీడీయాట్రిక్ అండ్ నియోనాటాలజిస్టు డా.ఆర్.మురార్జీ, డా.కే.సింధూరరెడ్డి, కన్సల్టెంట్ గైనకాలజిస్టు డా.శిల్పా చౌదరి మాట్లాడుతూ 6 నెలల పాటు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో రోగ నిరోధక శక్తి పెరుగు తుందని, దీర్ఘకాలికంగా చూస్తే డయాబెటిస్, ఊబ కాయం శ్వాస సంబం ధిత సమస్యల నుంచి బిడ్డను రక్షించగలదని అన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ఓర్వకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం గ్రామ గడివేముల బస్టాండు సమీపంలోని జంగాలపేటలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మరుగుదొడ్లను గతంలో గ్రీన్‌కో అధికారులు నిర్మించారు. అయితే.. కొంత కాలంగా ఉపయోగించకపోవడంతో అవి నిరుపయోగం మారాయి. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లను విని యోగంలోకి తీసుకురావాలని మహిళలు కోరుతున్నారు.



హుసేనాపురంలో అలంకారప్రాయంగా మరుగుదొడ్లు

బండరాళ్లు తొలగించాలి



రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాధాకృష్ణ థియేటర్ నుంచి నెహ్రూరోడ్డు వరకు సిమెంటు రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డంతా దుమ్ము ఉండటంతోపాటు బండ రాళ్లను అడ్డంగా పెట్టారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు ద్విచక్ర వాహనదారులు కింది పడిన సంఘటనలు ఉన్నాయని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బండరాళ్లను తొలగిం చాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు సంతాన నాగదేవత ప్రభోత్సవం

గూడూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరులో వెలసిన సంతాన నాగదేవత ప్రభోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు సంతాన నాగమ్మ భక్త బృందం తెలిపింది. శుక్రవారం అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం 28వ సంతాన నాగదేవత ప్రభోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. అలాగే అన్నదా నం, అఖండ భజనలు నిర్వహిస్తామన్నారు.

పాడైపోతున్నాయ్..!



● నిరుపయోగంగా ట్రాక్టర్లు
● ప్రజాధనం దుర్వినియోగం
● పట్టించుకునే వారే లేరు?
● తమకైనా ఇవ్వాలంటున్న రైతులు

ఓర్వకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం సహకార పరపతి సంఘాలకు వ్యవసాయ పనుల కోసం 2014లో ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందజేశారు. వాటిని వాడుకోకుండా పక్కన పడేయడంతో అవి పాడైపోతున్నాయి. ఓర్వకల్లు సహకార పరపతి సంఘానికి నన్నూరు సహకార పరపతి సంఘానికి ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ పరికరాలను కూడా ఇచ్చారు. వాటిని సహకార సంఘంలో కమిటీని ఏర్పాటుచేసి రైతుల పొలాలకు తక్కువ రేటుతో బాడుగకు పంపాలి. ఏడాది పాటు సహకార సంఘం వారు ట్రాక్టర్లను రైతులకు బాడుగలకు ఇచ్చారు. ఆతర్వాత ఏమైందోగాని సహకార సంఘం వెనుక ప్రాంతాల్లో నిరూపయోగంగా వదిలేశారు. పట్టుకునే వారు కరువయ్యారు. ఇప్పటి కైనా సొసైటీలకు నూతన అధ్యక్షులు ఎంపిక చేశారని, వారైనా ప్రత్యేక చొరవ తీసుకుని ట్రాక్టర్లను పనిచేసే విధంగా కృషిచేసి రైతులకు తక్కువ రేటుతో పొలాల్లో పనులు చేసేందుకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ట్రాక్టర్లను సహకార సం ఘం వారికి కాకుండా ప్రైవేటు వ్యక్తులకు బాడుగలకు ఇస్తే న్యాయం జరగడమే కాకుండా సంఘానికి ఆదా యం వస్తుందని రైతులు అంటున్నారు.



నన్నూరు సొసైటీలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్



ఓర్వకల్లులో మూలనపడిన వ్యవసాయ పనిముట్లు

అధికారులు స్పందించకపోవడం..



సహకార సంఘానికి ప్రభుత్వం రెండు ట్రాక్టర్లను మంజూరు చేసింది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సొసైటీలకు ట్రాక్టర్లతో పాటు వ్యవ సాయ పనిముట్లు ఇచ్చారు. అవి ఏడాది పాటు పనిచేశాయి. ఆతర్వాత నిరుప యోగంగా మారాయి. అధికారులు స్పందించకపో వడం దారుణం.

● అబ్దుల్లా, రైతు, ఓర్వకల్లు

కమిటీని ఏర్పాటు చేయండి



సహకార సంఘం ఆధ్వ ర్యంలో కమిటీని ఏర్పాటుచేసి కమిటీ ద్వారా రైతు లకు తక్కువ రేట్లకు పొలాలకు బాడుగలకు పంపాలి. దీంతో రైతులకు ప్రయోజనం కలు గుతుంది. వీటిపై అధికారులు స్పం దించాల్సిన అవసరం ఉంది.

● పుల్లారెడ్డి, రైతు, పూడిచెర్ల

యంత్రాలు పని చేసేలా చర్యలు



సహకార సంఘంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్ పనిముట్లను పని చేసేలా చర్యలు తీసుకుం టాం. ఈవిషయాన్ని జిల్లా సమావేశంలో చర్చించి యంత్రాలు, పరి కరాలు పని చేసేలా చర్యలు చేస్తాం.

● సుధాకర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు, ఓర్వకల్లు

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

వాగులు, వంకలు దాటొద్దు


తహసీల్దార్ రమేష్

ఆదోని రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులు, వంకలు దాటొద్దని తహసీల్దార్ రమేష్ సూచించారు. శుక్రవారం మాట్లాడుతూ, వారం నుంచి అధిక వర్షాలు నమోదవుతున్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వరద బాధితుల కోసం తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. మట్టిమిద్దెలు, పాడైన భవనాల్లో ఉండవద్దన్నారు. అత్యవసర సాయం అవసరమైన వారు 24గంటల్లో ఎప్పుడైనా 9985116998, 9885821076, 6300094952, 6305534012 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

'కేవీఆర్' ప్రిన్సిపాల్‌పై విచారణ చేయాలి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అవినీతిపై సమగ్ర విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌వో నాయకుడు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనాపురం ఉదయ్, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. శుక్రవారం భీమాస్ హాలులో మాట్లాడుతూ 13 ఏళ్లుగా విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజులు, ఫండ్, రకరకాల ఫీజుల రూపంలో వసూలు చేసి స్వాహా చేశారని ఆరోపించారు. విద్యార్థుల పేర్లు చూపకుండా, కేవలం సంఖ్యతో నిధులను స్వాహా చేశారని, వాచ్‌మెన్, స్వీపర్ల జీతాలను తన ఖాతాలో మళ్లించుకున్నారని ఆరోపించారు.

సీఎం సహాయ నిధితో అండ


చెక్కు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు అండగా ఉంటుందని టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్ అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో దేవనకొండకు చెందిన మల్లేశ్వరి, నరసింహులుకు చెక్కులను పంపిణీ చేశారు. వైద్య చికిత్స చేయించుకున్న వారికి అండగా ఉంటుందన్నారు. బండ్లయ్య, మలకన్న, మస్తాన్, తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆ భూమిపై సర్వ హక్కులు మావే'

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో మండిగిరి గ్రామ సర్వే నెం.221బి, 222బి, 223బిలోని 5 ఎకరాల 64 సెంట్ల భూమిపై సర్వ హక్కులు తమదేనని గులాం అలీ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి 'ప్లాట్లలో రాళ్ల తొలగించడం అన్యాయం' కథనంపై స్పందించారు. తనపై కొందరు నిరాధామైన ఆరోపణలు చేస్తున్నారని, తన తండ్రి మోదిన్ సాబ్‌కు తెలియకుండా హజరాత్, శేక్షావలి, ఖైరున్ బీ అనే ముగ్గురు వ్యక్తులు 2000లో తప్పుడు పత్రాలు సృష్టించి మధ్యవర్తి ద్వారా ప్లాట్లు వేసి అమ్మారన్నారు. దీనిపై తాము కోర్టుకు వెళ్లడంతో తమకే అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. తప్పుడు పొలం పత్రాలను ఆర్డీవో రద్దుచేసి ఎవంశపారంపర్యంగా వచ్చిన ఇబ్రహీం, గులాం అలీ పేర్లతో పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఆర్డీవో ఇచ్చారన్నారు. ప్లాట్లు కొన్నవారు మధ్యవర్తి తోనే తేల్చుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులతోనే పరిశుభ్రత


దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, మాజీ సర్పంచ్

మద్దికెర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయని మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, పాస్టర్ ఆనంద్, పారా శామేల్ అన్నారు. శుక్రవారం ఎస్సీ కాలనీలో 50 మంది పారిశుధ్య కార్మికులకు గడ్డం రంగప్ప భార్య శాంతమ్మ జ్ఞాపకార్థకంగా నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్మికులను చిన్న చూపు చూడకుండా ఆదరించాలని కోరారు. కాలనీవాసులు ఆర్.వెంకటేశ్వర్లు, భాస్కర్, హ్యాపీ పాల్, గద్దల రాజు, బాబు తదితరులు ఉన్నారు.

ఆస్పరి సీఐగా గంగాధర్



ఆస్పరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మస్తాన్‌వలి కర్నూలుకు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తునన గంగాధర్‌ను అధికారులు ఆస్పరికి బదిలీ చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



తిమ్మారెడ్డి బస్టాండ్ నుంచి మాధవరం రహదారి దుస్థితి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ నుంచి మాధవరం వెళ్లే రహదారి దారుణంగా ఉంది. చిన్న వర్షం వచ్చినా ఈ దారిపై నడవాలంటేనే వాహనదారులు, ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. రహదారిపై గుంతలు ఉండటం, వర్షపు నీరు నిలవడంతో ఆటోలు, మార్కెట్ యార్డ్‌కు వెళ్లే పత్తి వేరుశనగ లోడ్ వాహనాలు గుంతల్లో ఇరుక్కొని బోల్తా పడుతున్నాయి. పాదాచారులు కూడా నడవలేని పరిస్థితి. ఆర్అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చాడలని వాహనదారులు కోరుతున్నారు.



తెర్నేకల్లు రహదారిపై వర్షపునీరు

దేవనకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నెకల్లు ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలవడంతో మడుగులా తయారైంది. గ్రామంలో డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక ఇలా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.



గృహాల మధ్య ఉన్న డ్రెయినేజీ, వర్షపునీరు

పత్తికొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప కాంప్లెక్స్ వెనక ఉన్న యశోద టవర్స్ కాలనీలో డ్రెయినేజీ లేకపోవడంతో అటు వర్షపునీరు, ఇటు మురుగ చేరి కుంటను తలపిస్తోంది. దీంతో దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవో నరసింహులను వివరణ కోరగా, రెండు మూడు రోజుల్లో నీరు నిల్వ లేకుండా చూస్తామన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ హేమలత, పోలీసులు

విద్యాసంస్థలలో క్రీడలపై దృష్టి పెట్టాలి : డీఎస్పీ హేమలత

ఆదోని, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని డీఎస్పీ హేమలత సూచించారు. శుక్రవారం స్థానిక రోషన్ గార్డెన్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఒత్తిడికి లోనై సినిమాలు, ఇతర ప్రచార మాధ్యమాల ప్రభావంతో డ్రగ్స్‌కు అలవాటు పడటం విచారకరమన్నారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, ధ్యానం, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలను ప్రోత్సహించాలని, పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల లోపు సిగరెట్లు, మద్యం విక్రయించకూడదన్నారు. ఈ నిబంధనను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా నేరమన్నారు. కేసు నమోదైతే పదేళ్లకు పైబడి జైలు శిక్ష, రూ.లక్షకు పైగా జరిమానా ఉంటుందన్నారు. జైలు శిక్ష అనంతరం బయటకు నిందితులపై పోలీసు నిఘా ఉంటుందని, ఎక్కడ ఆ కేసుకి సంబంధించిన మూలాలు ఉన్నా పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఐ నల్లప్ప, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

• ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎద్దులదొడ్డిలో మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు జీతాలు, చేనేతలకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు, మత్స్యకార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సోలార్ విద్యుత్‌లో కూడా బీసీలకు సబ్సిడీ అందిస్తున్నారనీ, గృహాలు నిర్మించుకున్న బీసీలకు అదనంగా బిల్లు పెంచుతామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం త్వరలో అసెంబ్లీలో తీర్మానం చేస్తారన్నారు. తుగ్గలి నాగేంద్ర, వెంకటస్వామి, శ్రీనివాసులు గౌడు, తిరుపాల్ నాయుడు సర్పంచ్ విజయుడు ఉన్నారు.

పైప్‌లైన్లను రక్షించుకోవాలి

పత్తికొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ పరిధిలోని పైపులైన్లను అందరూ సంరక్షించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కోరారు. శుక్రవారం మాట్లాడుతూ మమ నియోజకవర్గ పరిధిలో 68 చెరువులు ఉన్నాయని, వీటికి నీటిని మళ్లిస్తుండటంతో నీటితో కళకళలాడుతు న్నాయన్నారు. అయితే కొందరు పైప్‌లైన్లను పగులకొడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇలా చేస్తే కింది ప్రాంతాలకు నీరు అందదని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల కాపరులు, రైతులు పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నట్లు సమాచారం ఉందని, ఇకపై అలా చేస్తే అధికారులు కేసులు నమోదుచేస్తారని హెచ్చరించారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

తుగ్గలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ సర్పంచ్ మసాల శ్రీను కోరారు. శుక్రవారం రాంకొండలో పారిశుధ్య పనులు చేసి, ట్యాంకులను శుభ్రం చేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మించారన్నారు. ప్రజలు చెత్తను పారవేయకుండా, పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యదర్శి ముంతాజ్ బేగం, టీడీపీ నాయకులు నాగరాజు, మహేష్, వెంకటేష్, చెన్నకేశవ ఉన్నారు.

సేవలు మరువలేనివి

తుగ్గలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దివంగత సీపీఐ నాయకుడు నారాయణ స్వామి సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకుడు నబీ రసూల్ అన్నారు. శుక్రవారం మండలంలోని జి.ఎర్రగుడిలో చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రామస్థుల చేత అరుణపతాకం స్వీకరించారు. గిత్తా నగేష్, కొండారెడ్డి, కృష్ణ, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వెల్దుర్తి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్ నిర్వహణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శేషాద్రి పేర్కొన్నారు. గోవర్ధనగిరి, చెర్లకొత్తూరు గ్రామాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 5గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి 5 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. అలాగే వెల్దుర్తి, కలగొట్ల, రామళ్లకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు అంతరాయం ఉంటుందని, వ్యవసాయ విద్యుత్తు ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మంత్రిని కలిసిన వెంకప్ప


మంత్రితో జనసేన ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరి ప్రసాద్‌ను జనసేన ఇన్‌చార్జి వెంకప్ప శుక్రవారం విజయవాడలో కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, సెప్టెంబర్ నుంచి ప్రజల మధ్యకు వెళ్లాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ

ఆదోని రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లులో బాట లక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు ఆలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, ఉమాపతి నాయుడు, మారుతి నాయుడు పూజలు చేశారు.

మధ్యాహ్నం వరకు అంతరాయం

పత్తికొండ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ రెండో శనివారం రోజు మరమ్మతుల నిమిత్తం దేవనబండ, పత్తికొండ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి: డీపీవో


వెల్దుర్తిలో ట్యాంకును పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్

వెల్దుర్తి/టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం వెల్దుర్తి 9, 14వ వార్డుల్లో పర్యటించారు. కాలువలను శుభ్రంగా ఉంచాలని, తాగునీటి పైపుల లీకేజీ అరికట్టాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాని వైద్య సిబ్బందికి సూచించారు. కాచి చల్లార్చి, వడబోసిన నీటిని తాగాలన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్, సిబ్బంది ఉన్నారు.

రజకుల అభివృద్ధికి సహకరించాలి


పీఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న సావిత్రి

ఆదోని టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధి, స్థిగతులను మెరుగుపరిచేందుకు సకరించాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. శుక్రవారం శుక్రవారం వెలగపూడి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారా యణకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో రజకుల పరిస్థితి దయనీయంగా ఉందని, వారి అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన 6 27, 102జీవోలను అమలుచేయాలని, లాండ్రీలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. అందించాలని 50 సంవత్సరాలు నిండిన రజకులకు పింఛన్ మంజూరు చేయాలని దోభి ఘాట్లపై రజకులకు శాశ్వత హక్కు కల్పించాలని విన్నవించారు. స్పందించిన సెక్రటరీ సీఎం దృష్టికి తీసుకెళ్తానని సెక్రటరీ తెలిపారు. డైరెక్టర్లు చంద్రశేఖర్, దుర్గప్రసాద్, గోపి, రామాంజినేయులు, ధర్మారావు పాల్గొన్నారు.

ఎస్టీలో చేర్చాలి


కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌ను నాయకులు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కలిసి విన్నవిం చినట్లు ఏపీవీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు, అర్జున్ తెలిపారు. ఎన్‌డీయే ప్రభుత్వం వాల్మీకులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరామన్నారు. ఎస్టీ జాబితాలోకి చేర్చే అంశంపై కచ్చితంగా కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవయ్య, ప్రధాన కార్యదర్శి తలారి ఆదినారాయణ, రామలింగమయ్య, మద్దిలేటి, వీరేష్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు గోపాల్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆదోని కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని అక్షర శ్రీ పాఠశాలలో గౌరవాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి గౌరవ సలహాదారులుగా కేశవ నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అధ్యక్షుడిగా నాగేంద్ర, ప్రధాన కార్యద ర్శిగా కృష్ణమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా దశరథరా ముడు, ఉపాధ్యక్షులుగా నాగరాజ్, హుసే నప్ప, హరిపాండురంగను ఎన్నుకున్నారు.

హంద్రీకి వరద


తెర్నేకల్లు వద్ద ప్రవహిస్తున్న హంద్రీ

దేవనకొండ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలతో హంద్రీ నదికి నీరు చేరుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రవాహం పెరిగింది. వర్షం నీరుతో పాటు, హంద్రీనీవా కాలువ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు తాగునీటి అవసరాలకు నీరు వదలడంతో ప్రవాహ వేగం పెరిగింది. దీంతో పరీవాహక ప్రాంతాల పంటల సాగుకు ఉపయోగంగా ఉంటుంది.

రామాలయానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు

ఆదోని టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమరావతి నగర్ కాలనీలో కోదండరాముడి ఆలయానికి శుక్రవారం బీజేపీ నాయకుడు, వేద పండితుడు వెల్లాల మధుసూదన్ శర్మ భూమి పూజ నిర్వహించారు. దాదాపు 4వందలకు పైచిలుకు కుటుంబాలు ఉన్న ఈ ప్రాంతంలో ఒక్క ఆలయం కూడా లేకపోవడంతో శుభకా ర్యాలకు ఇబ్బందిగా ఉందన్నారు. అందరి సమ్మతంతో ఈ ప్రాంతంలో కోదండ రాముడి ఆలయ నిర్మాణం ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మిసలీమ్ అమరావతి టీడీపీ ఇన్‌చార్జి మొహమ్మద్ బాషా, బీజేపీ నాయకులు బాషా, నాగార్జున, పగడాల కిరణ్ పాల్గొన్నారు.

గుంతలమయం


నడిచేందుకు కూడా వీలుకాని దారి


గుంతల దారిలో వాహనదారుల అవస్థలు

• నడిచేందుకు కూడా వీలు కాని అరికెర-కురువళ్లి రహదారి

ఆలూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికెర-కురువళ్లి గ్రామాల మధ్య రహదారిపై గుంతలు పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పెద్ద గుంతలు, ముళ్లకంప ఉండటంతో పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురువళ్లి సమీపంలో పదేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు వరద ధాటికి కొట్టుకు పోయి ప్రజలకు, రైతులకు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి నూతన రహదారిని నిర్మించాలని కురువళ్లి సర్పంచ్ ఉప్పర రవి, నాయకులు రమేష్, తిక్కన్న, మల్లయ్య కోరారు.

చేనేతలకు అండగా ఉంటాం: బీజేపీ



నిరుపేద చేనేతలకు నగదు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నందవరం, అగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిరుపేద చేనేతలకు అండగా ఉంటామని బీజేపీ నాయకులు గురురాజరావు అన్నారు. శుక్రవారం నందవరంలోని నిరుపేద చేనేతలైన నరసప్ప, యంకప్ప చేనేతల ఇళ్లకు వెళ్లి వారిని శాలువలతో సన్మానించి వారికి ఆర్థికంగా సాయం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చేనేతలు ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇచ్చి గృహాలు మంజురు చేయించి ఇస్తామన్నారు. ప్రధాని మోదీ చేనేతల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వారిని అదుకుంటున్నాడని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడు, శివ, అబ్దుల్, గని, హనుమన్న, నాగరాజు మినాల్లా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక



సోమేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మంత్రాలయం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న టీ.సోమేష్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అంపయ్య తెలిపారు. శుక్రవారం మంత్రాలయం ఉన్నత పాఠశాల ఆవరణంలో సోమేశ్‌ను అభినందించారు. రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మంత్రాలయం ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థి సోమేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో హెచ్‌ఎం అంపయ్య, ఉపాధ్యాయులు విఠోభరావు, పాపన్న, గోపాల్, రవీంద్ర, నరసింహరాజు, బసవరాజు, రామదాసు, రామకృష్ణ, చంద్రశేఖర్, హరికృష్ణ అభినందించారు.

రోడ్డుపై మురుగు

• ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
• పట్టించుకోని అధికారులు



ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు

కోసిగి, అగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని రంగప్పగట్టు సమీపంలోని డి.బెళగల్, చింతకుంట రోడ్లకు వెళ్లే ప్రధాన రోడ్డుపై తాగునీటి పైపులైన్ పగిలి లీకేజీ నీటితో పాటు డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతుండటంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూడు నెలలుగా రంగప్పగట్టు సమీపంలోని చింతకుంట రోడ్డులోని తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పారుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపైకి లీకేజీ నీరు రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు ప్రధాన రోడ్డుపై లీకేజీ, మురుగునీరును అరికట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పేదలకు అండగా టీడీపీ

గోనెగండ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):పేద ప్రజలకు అండగా నిరంతరం టీడీపీ ఉంటుందని టౌన్ టీడీపీ అధ్యక్షుడు మహాల్ రహంతుల్లా, నూరహమ్మద్, మదీనా అన్నారు. శుక్రవారం గ్రామంలో వారు టీడీపీ నాయకులను కలుపుకొని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నందవరం:టీడీపీ నాయకులు బండేగురు స్వామి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుజేశామన్నారు. శుక్రవారం మండలంలోని పూలచింత గ్రామంలో ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలిఅడుగులో బాగంగా టీడీపీ అందించిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నరు.

బంగారు ముక్కు పుడక విరాళం

పెద్దకడబూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులో వెలసిన గ్రామదేవత పెద్దలక్ష్మమ్మదేవికి ఓ భక్తుడు బంగారు ముక్కుపుడక విరాళంగా దేవాలయ పూజారికి అందజేశారు. పెద్దకడబూరు గ్రామానికి చెందిన రామకృష్ణ, జ్యోతి దంపతులు శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు ఒడి బియ్యంతో పాటు బంగారు ముక్కుపుడుకను ఆలయ పూజారి నరసింహచారికి అందజేశారు. విరాళం ఇచ్చిన దంపతులకు ఆలయ అర్చకులు పుష్పమంత్రాక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి జిల్లాలో వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి 13వ తేదీ వరకు మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 9వ తేదీన 26.8 మి.మీ. వర్షాపాతం, 10వ తేదీన 25 మి.మీ., 11వ తేదీన 10.4 మి.మీ., 12వ తేదీన 10.5 మి.మీ., 13వ తేదీన 8.7 మి.మీ., వర్షపాతం నమోదు అవుతుందన్నారు. అలాగే పగటి ఉష్ణోగ్రత గరిష్ఠంగా 32.8 నుంచి 33.8 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని, కనిష్ఠంగా 22 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని చెప్పారు

13న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనెల 13వ తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల మరో రెండువారాల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయన్నారు. పంటలను సాగుచేసే రైతులు వాతావరణ సమాచారాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. అలాగే పెరిగిన పైరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు ఏదైనా సమాచారం కావాలంటే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

● భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన మహిళలు
● భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
● పూజల్లో పాల్గొన్న ప్రముఖులు



డబ్బుల నోట్లతో మంచాలమ్మ దేవతను సుందరంగా అలంకరించిన దృశ్యం



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి



ప్రత్యేక అలంకరణలో మహలక్ష్మి అమ్మవారు

మంత్రాలయం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం: మఠంలో వరలక్ష్మి వ్రతంపఠనంగా జరుపుకున్నారు. గ్రామదేవత మంచాలమ్మకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. శుక్రవారం శ్రావణ మాస సప్తమి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురష్కరించుకొని వరలక్ష్మి వ్రతాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఆచారించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో భక్తులు ఉదయం నుంచి వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలతో ప్రత్యేకపూలతో అందంగా అలంకరించి. ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుంకుమార్చన, మహామంగళహారతి శాస్త్రోక్తంగా వరలక్ష్మీవ్రత కార్యక్రమాన్ని వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఈశ్వరదేవాలయంలో దేవాలయం నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

కౌతాళం: మండలంలో ఘనంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం నందు నూతనంగా నిర్మించిన వరలక్ష్మీ దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పూజలను ఆలయ ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ వర మహలక్ష్మి వ్రతం పూజల్లో పాల్గొనే మహిళా భక్తులు రూ.500 చెల్లించి పాల్గొనాలని తెలుపగా కొందరు టికెట్ తీసుకుని పూజల్లో పాల్గొనగా మరికొంత మంది మహిళా భక్తులు స్వామి వారి సేవ చేసేందుకు వస్తున్నామని తెలుపడంతో మహిళలకు ఎలాంటి టికెట్ లేకుండా ఉచితంగా పూజల్లో పాల్గొనే అవకాశం ఈఓ కల్పించారు. చాల మంది మహిళలు తమ ఇంట్లో అమ్మవారి ప్రతిమకు పూజలు చేపట్టారు.

బాగుపడని రహదారులు



పెద్దకడుబూరు- మేకడోన గ్రామ రహదారి దుస్థితి



కంకర తేలిన రోడ్డు

పెద్దకడబూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : గుంతలమైన రోడ్లలో ప్రయాణం అంటేనే నరకప్రాయం. ఇంకా వర్షాలు పడినపుడు ఆ.. రోడ్లలో ప్రయాణం నరకలోకానికి రహదారులే.. వైసీపీ ప్రభుత్వం పతనానికి ఈగుంతలరోడ్లు కూడా ముఖ్య కారణమని విశ్లేషకుల అభిప్రాయం..ఈ గోతుల రోడ్ల నుంచి ప్రజలను రక్షించాలనే ఉద్దేశ్యంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రహదారుల మరమ్మతుల చేసేందుకు నిధలు కేటాయించి, మరమ్మతులు చేసేందుకు ప్రారంభించింది. దానిలో భాగాంగానే పెద్దకడుబూరు మండలం నుంచి మేకడోన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి. దారి పూర్తి అధ్వానంగా ఉండడంతో అధికారులు దాదాపు ఏడునెలల క్రితం రూ.7లక్షలు వెచ్చించి ప్యాచ్ వర్క్ పూర్తి చేసినా.. నాణ్యతగా వేయకపోవడంతో, ఏడు నెలలకే రోడ్డుపై తారులేచి వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రూ. 50లక్షలకు పైగా పనులు: పెద్దకడబూరు మండలంలో దాదాపు 50లక్షలకు పైగా ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేశారు.. అయితే ఏ దారిని చూసినా ఏముంది గర్వకారణం అన్న రీతిలో ఏడు నెలలకే తారుపోయి కంకర రాళ్లు బయటపడ్డాయి. పెద్దకడుబూరు మండలంలో పెద్దకడుబూరు- మేకడోన, కల్లుకుంట, కంబళదిన్నె, కల్లుకుంట-బాపురం దారులకు అధికారులు మరమ్మతులు చేశారు. ఇంతా.. ఖర్చు పెట్టి చేసినా ప్రభుత్వ సోమ్ము అంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యింది తప్ప.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

నిధులు వృథా: మండలంలో అభివృద్ధి పనుల కోసం రూ.లక్షల్లో ప్రభుత్వం నిధులు వెచ్చించి, ప్రజలకు రహదారి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశ్యంతో టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారులకు మరమ్మతు పనులను మొదలు పెట్టారు. అయితే అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వార్థంతో రోడ్ల మరమ్మతులకు వెచ్చిస్తున్న నిధులు కాస్త దుర్వినియోగం అవుతున్నాయని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఓ వైపు నిధులు ఖర్చువుతున్నాయే గాని.. తమకు మాత్రం రహదారుల కష్టాలు తీరడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేసి తమకు రహదారి కష్టాలను తీర్చాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



నాసిరకంగా పనులు చేసిన కాంట్రక్టర్లపై చర్యలు తీసుకోవాలి. రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ఆర్ అండ్ బీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంది. అధికారుల, కాంట్రాక్టర్ల లోపాయికారి ఒప్పందాల వల్లనే నాసిరకంగా పనులు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నాసిరకంగా పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

\- ఆనంద్ రాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

మళ్లీ పనులు చేయిస్తాం



ఎక్కడైతే ప్యాచ్ వర్క్‌లు చేసిన చోట ప్యాచ్‌లు లేచిపోయి ఉంటాయో.. ఆ చోట మళ్లీ కాంట్రాక్టర్ల చేత ప్యాచ్ వర్కలను వేయిస్తాం. కాంట్రాక్టర్ల డిపాజిట్ నుంచే ఆ పనులు చేయించడం జరుగుతుంది. ప్రజలకు, వాహనదారులకు రహదారి కష్టాలు లేకుండా చూస్తాం.

విజయ్ నరేష్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ ఇంజనీర్, ఆర్అండ్‌బీ, పెద్దకడబూరు

సేవలు అందించడమే శ్రీమఠం లక్ష్యం



పుష్కరిణికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే శ్రీమఠం లక్ష్యంగా పని చేస్తున్నామని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఉత్సవాల్లో మొదటి రోజు శుక్రవారం రూ.3.50 కోట్లతో బెంగుళూరు చెందిన భక్తుడు ప్రకాశ్‌శెట్టి నిర్మించి ఇచ్చిన పుష్కరిణి శిలాఫలకం ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి పూజలు చేసి, తెప్పోత్సవంపై దాత కుటుంబంతో కలిసి విహరించారు. అనంతరం రూ.80 లక్షలతో నిర్మించిన వాఘేష్ నిలయం రూ.45 లక్షలతో నిర్మించిన కవీంద్ర వాఘీశుడు నిలాయాల శిలాఫలకం ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదే విదంగా 45 డిజిటల్ లాకర్లు, మరొక చోట 90 డిజిటల్ లాకర్లను భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. పుష్కరిణికి పరిమళ తీర్థంగా నామకరణం చేసి ఉదయం నుంచి హోమాలు నిర్వహించి శాంతి పూజలు చేశారు. ఈసందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఉత్సవాలతో పాటు సామాన్య రోజుల్లో భక్తులకు వసతులు లేని వారికి, ఒంటరిగా వచ్చిన వారికి లాకర్, డార్మెంటరీ ఆధునిక వసతులు అందుబాటులోకి తెచ్చామన్నారు. మంత్రాలయం దర్శనార్థం వచ్చిన భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా శీఘ్రదర్శనం పొందేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విరాళం ఇచ్చి పుష్కరిణిని నిర్మించిన ప్రకాశ్ శెట్టికి మెమెంటో శేషవస్త్రం ఇచ్చి ఫల పుష్ప మంత్రాక్షితలు వేసి ఆశీర్వదించారు

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జ్యోతి ములిమణి కుటుంబ సమేతంగా శుక్రవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈమెకు మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. ఆమె వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఎంఎన్ భార్గవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, తదితరులు ఉన్నారు.



మఠం అధికారులతో పీఠాధిపతి

బాలికల విద్యతోనే ప్రగతి

గోనెగండ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యతోనే ప్రగతి పథంలో దేశం నిలుస్తుందని ఏబీసీడబ్ల్యువో శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ శిరీషా, టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని బాలికల బీసీ హాస్టల్లో ఫ్రెషర్స్, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీసీడబ్ల్యువో శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో మహిళలు విద్యలో దూసుకువెలుతున్న తీరును వివరించారు. అలాగే మహిళల విద్య క్రమశిక్షణా బాలికల భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల విద్యాధికారికి ఘన సన్మానం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాధికారి రాజారాం మోహన్‌ను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎమ్మిగనూరు పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజారాం మోహన్ గత వారం జరిగిన పదోన్నతల్లో ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జిగా, పత్తికొండ మండల విద్యాధికారిగా పదొన్నతిని పొందారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణ పీఈటీల అధ్వర్యంలో ప్రిన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వాహబ్ కలసి ఘనంగా సత్కరించారు. పీఈటి ఉపాధ్యాయులు హనీఫ్, సుజనకుమారి, శ్రీను, నర్సింహరాజు, చాంద్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : దుకాణాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ప్రకటించినందుకు నాయీ బ్రాహ్మణుల సంఘం పట్టణ అధ్యక్షుడు నరసయ్య, జిల్లా ఇన్‌చార్జి బాలు కృతజ్ఞతలు తెలిపారు. సోమప్ప సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ ముందుగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి నాయి బ్రాహ్మణుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజన్న, గోవిందు, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో నేడు జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ సర్పంచ్ మహేశ్వరమ్మ, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మండల కార్యదర్శి రాజీవ్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మిగనూరు మండలంలోని కె. తిమ్మాపురంలో కామ్రేడ్ బీజీ మాదన్న స్తూపం వద్ద బీజీ మాదన్నకు నివాళి అర్పించి మహాసభలకు సిద్ధమయ్యారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి విరుపాక్షి నాయుడు, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, బజారప్ప, మల్లికార్జున, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గాజులదిన్నెకు ఎల్లెల్సీ నీరు



ఎల్లెల్సీ నీటిని జీడీపీలోకి మళ్లించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోనెగండ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):తుంగభద్ర దిగువ కాలువ నుంచి గోనెగండ్ల ఎస్కేప్ చానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టులోకి 111 క్యూసెక్కుల నీటిని శుక్రవారం ఉదయం ఇరిగేషన్ అధికారులు మళ్లించారు. గత మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'నీటి కష్టాలు తప్పవా' అన్న శీర్షిక ప్రచురించిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. శుక్రవారం గోనెగండ్ల సెక్షన్‌కు తుంగభద్ర దిగువ కాలువ నుంచి 150 క్యూసెక్కులు చేరడంతో గాజులదిన్నె ప్రాజెక్టుకు 111 క్యూసెక్కులు మళ్లించి కోడుమూరుకు 20క్యూసెక్కులు విడుదల చేశారు. మిగిలిన 29 క్యూసెక్కులను గోనెగండ్ల లోని పీడీ, ఎంఎల్ఎస్‌పా, డీపీ86 కాలువల కింద సాగుచేసిన పొలాలకు గోనెగండ్ల, అలువాల తాగునీటి పథకాలను విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

రాఖీ పండుగ.. సందడే సందడి



అమ్మకానికి పెట్టిన పలు రకాల రాఖీలు

గోనెగండ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గుర్తుగా ప్రతి ఏడాది జరుపుకునే రాఖీ పండుగ సందడి వచ్చేసింది. రక్షాబంధన్(రాఖీ) పండుగ శనివారం జరుపుకుంటున్న సందర్భంగా పట్టణం, గ్రామాల్లో సందడి నెలకొంది. ప్రతీ ఫ్యాన్సీస్టోర్స్, బుక్‌స్టాల్స్ ఇలా ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణం లోనూ, అంగళ్లలోను రాఖీ అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. రంగురంగుల దారలతో తయారు చేసిన రాఖీలు రూ.50 నుంచి 200 వరకు వాటి ధర నిర్ణయించి అమ్మకాలు జరుపుకుంటున్నారు. రాఖీలు రంగురంగుల్లో రత్నాలు, బంగారు, తోరణాలు నెమలి ఈకలు, ఓంకారం, స్వస్తిక్ ఇలా ఆకర్షణీయంగా వివిధ ఆకారాల్లో ఉండటంతో చెల్లెల్లు కొనుగోలు చేస్తు ఓ పెద్ద పండుగలా సందడి చేస్తున్నారు.